# కాలం కొలవని మనిషి

-శ్రీవిరించి

'తాతయ్యా, నేను వచ్చేశాను'- అంటూ రెండు చేతులతో తడిక తోసివేస్తూ లోపలకు వచ్చాడు అయిదేళ్ల బిందు. చిన్న టిఫిన్ బాక్స్ వుంది వాడి భుజానికి వేలాడుతున్న సంచిలో. దాన్ని చిన్న చేతులతో పైకి తీసి తాతయ్య ఎదురుగుండా పెట్టి, 'తిను, తాతయ్యా!' అన్నాడు.

గరుడాచలం అప్పటికే స్నానం చేశాడు, వీధి కుళాయి దగ్గర. తెల్లటి తుండుగుడ్డతో ఒళ్లంతా శుభ్రంగా తుడుచుకుని బయటకు వెళ్లటానికి తయారవుతున్నాడు. ఇంకో అరగంటసేపు అయితేగాని వేషం పూర్తికాదు. ఇంతలో- కడుపులో ఆకలి తల్లి కనిపెట్టినట్లుగా, కోడలు టిఫిన్ బాక్స్ పంపించింది. అది కాస్త తింటే తప్ప వంట్లో సత్తువ రాదు.

నిన్న ఆదివారం గనుక బయటకు వెళ్లలేదు. గుడిసెలోనే ఒక పక్క ముడుచుకుని పడుకున్నాడు. జీవితాన్ని గురించి ఆలోచించి, ఆలోచించి విసిగిపోయి నిద్రపోయాడు. ఆలోచించటానికి తప్ప నిజంగా జీవించటానికి అతనికి ధైర్యం లేదు. ఒంట్లో ఓపిక లేదు. యంత్రంలాగ రోజూ ఒకే పని చేయడం యిష్టం లేక ఆదివారం సెలవు దినంగా ప్రకటించుకున్నాడు. వృత్తిలో వున్నప్పుడు కూడా ఆ రోజున ఎప్పుడూ పనిముట్లని ఎరుగడు. హాయిగా పెండ్లాం, పిల్లలతో గడపడం- మధ్యాహ్నం పూట కడుపు నిండా తిని కంటినిండా నిద్రపోవడం, సాయంత్రం షికారుగా నదీ తీరానికి వెళ్లి ఇటు హాయిగా ప్రవిస్తున్న నీటి తెరల్ని, అటు పురాతనం అయిన పర్వతాన్నీ చూస్తూ గంటలు గంటలు సునాయాసంగా గడిపివేయడం నేర్చుకున్నాడు. స్థిరంగా వుండే పర్వతం అతనికి ఎన్నో నేర్పింది. అందులో ముఖ్యమైనది- స్థిరమైన నడవడి. నీటి తెరలు పైకి లేచినా, మళ్లీ సమతలానికి చేరుకోవలసిందే. అన్నిటితో కలిసి ముందుకు సాగిపోవలసిందే.

గరుడాచలం వయసులో వున్నప్పుడు వడ్రంగం వృత్తి చేసేవాడు. ఆ వృత్తిలోని మెలుకువలన్నీ నేర్చుకుని 'మంచివాడు' అని బిరుదు సంపాదించుకున్నాడు. పని మంచిగా చేయడంమటుకే కాదు, అతను చెప్పిన సమయానికి పూర్తిచేస్తాడు. డబ్బులు వసూలు చేయడంలో కూడా సరయిన ధరే తప్ప ఎప్పుడూ దురాశగా, అవతలి వాడి ఆర్థిక అంతస్తును బట్టి తీసుకునేవాడు కాదు.

'తాతయ్యా, తినవే?' అన్నాడు బిందు, గరుడాచలం వస్త్రధారణ అంతా గమనిస్తూనే. గరుడాచలం ముఖానికి, వంటికి విభూతి పూసుకున్నాడు. ఆ రేఖల మీదనే ఎర్రటి సింధూరం పెట్టుకున్నాడు - నుదుటి మీద. గుండ్రటి మెడ బనీను తొడుక్కున్నాడు. దాని మీద రుద్రాక్ష మాలలు, గాజు పూసల దండలు నాలుగయిదు వేసుకున్నాడు. కాషాయ రంగు లుంగీ రెండు పొరలుగా మడిచి మోకాళ్ల వరకు కట్టుకున్నాడు. వీపు కప్పుకుంటూ భుజాల మీద బళ్లారి ఎర్రరంగు కండువా వేసుకున్నాడు. అతని 'వేషం' పూర్తయినట్లే. సాయంత్రం అయిదు- ఆరు గంటల వరకు ఇంటికి తిరిగి వచ్చేంత వరకు - తిరిగి పాకలో పునః ప్రవేశం చేసేంత వరకు ఇదే వేషం.

తడిక గోడకు - తూర్పు వైపున - షిరిడీ సాయిబాబా బొమ్మ వేలాడుతోంది. ఆ బొమ్మకు కట్టిన తాడు బాగా పొడుగ్గా వుంది. అతను బయటకు వెళ్లినప్పుడు, ఆ బొమ్మ అతని మెడలో వేలాడుతూ వుంటుంది. బాబా ముఖం అతని గుండెల మీద కుదురుగా కూర్చోవడం కోసం తాడు అంత పొడుగ్గానూ వుండవలసిందే. ఇంటికి వచ్చాక దాన్ని తడిక గోడకు తగిలించేసి ఒక్క నమస్కారం చేసి మళ్లీ మరునాటి వరకు ముట్టుకోడు.

'తింటాలేరా, తొందరేం.. ఊ.. చెప్పు, నిన్నంతా యేం చేశావు? బడి లేదు గదా!' అని అడిగాడు గరుడాచలం. మనవడిని ముద్దుగా దగ్గరకు తీసుకుంటూ. 'బడి లేకపోతేనేం? తాతయ్యా, పగలంతా అక్షరాలన్నీ పలక మీద రాసుకున్నాను. సాయంత్రం మటుకు భలేగా ఆడుకున్నాన్లే- నా సావాసగాళ్లు అందరితో...' అంటూ మొదలెట్టి తాను ఆడిన ఆటలు, తన స్నేహితుల పేర్లు, వాళ్లు ఆడే పద్ధతులూ.. అన్నీ వివరంగా చెప్పడం సాగించాడు బిందు.

వీడయినా కాస్త చదువుకుని ఉలి - బాడిస - రంపం... వీటికి దూరంగా యేదయినా మంచి ఉద్యోగం సంపాదించుకుని పిల్ల పాపలతో హాయిగా వుం

డాలి అనుకున్నాడు గరుడాచలం. నిజానికి తన కొడుకు కూడా కుల విద్య నేర్చుకుందుకు ముందు మహామారాం చేశాడు. బడికిపోయి చదువుకోవాలని ఆశ వాడికి. చదువుకో వద్దనను. కాని కుల విద్య మటుకు నేర్చుకోవలసిందే. దాంట్లోనే నీ బతుకు తెల్లవారిపోవలసిందే–' అని గట్టిగా పట్టుబట్టి, కొడుక్కి ఇష్టం లేకపోయినా మెడలు వంచి మరీ నేర్పాడు వడ్రంగం వృత్తి. పనికి కావలసినంత వరకు, లెక్క డొక్క రాసుకుందుకు వీలుగా ఎనిమిదో తరగతి దాకా చదువు. అంతే! పది ప్యాసయ్యాడంటే ఈ కొడుకు నాకు దక్కడు అని గరుడాచలం ముందుగానే సరీగా ఊహించాడు. తను ఎంతవరకు గిరిగీసుకున్నాడో అంతవరకే ఎవరినైనా వెళ్లనిస్తాడు గరుడాచలం.

కొడుకు కూడా తన వృత్తిలోనే కూరుకుపోవడంతో తన జీవితానికి సార్థకత వచ్చిందనుకున్నాడు గరుడాచలం. తనకు మధ్య వయసులోనే భార్య పోయింది. పోయిందంటే ఆ తప్పు ఆమెది కాదు. పుష్టికరమైన ఆహారం లేకపోవడం, ఆ ఆహార లోపం వల్ల వచ్చిన జబ్బులు తట్టుకోవటానికి డాక్టర్లు వ్రాసే జాబితాల మందులు కొనుక్కురాలేకపోవడం.. ఇవే కారణాలు ఆమె అంత త్వరగా పోవటానికి అని గరుడాచలానికి బాగా తెలుసు. అయితేమటుకు యేం చేస్తాడు? అశక్తుడు – పరాధీనుడు. జీవితంలో ఎంత దొరికితే అంతతోనే తృప్తిగా, సంతోషంగా, ఫిర్యాదులు చేయకుండా వుండిపోవాలని అతని వేదాంతం. భార్య పోయిందని, కొడుకును యేమయినా అశ్రద్ధగా సాకాడా? ఉహూ. లేదు. తల్లీ తండ్రీ తానే అయి వాడిని ఒక యింటి వాడిని చేశాడు.

అయితే ఆ తృప్తి కొడుక్కు లేదు. అదే విచారం గరుడాచలానికి. తన పోకడలకు, అభిప్రాయాలకు చుక్కెదురుగా వుంటాయి వాడి పోకడలు, ఆలోచనలు. తన పెంపకంలో ఏదో లోపం వుంది, లేకపోతే వాడు ఇట్లా తయారవడు. ఆ లోపం ఏమిటో నాకు ఇప్పటికీ అర్థం కాకుండా వుంది... అని వాపోతాడు గరుడాచలం స్వగతంగానే. పైకి మాత్రం నోరు మూసుకుని వుండిపోతాడు. కొడుకు తిట్టినా, దెప్పిపొడిచినా, ఇంట్లో నుంచి వెళ్లిపో అని గెంటినా గరుడాచలం మటుకు వాడి మీద కోపం పెంచుకోలేదు. ద్వేషం యేర్పడనివ్వలేదు. అయితే యేం లాభం? కొడుకు ఇంట్లో నీడపట్టున వృద్ధాప్యం గడిపివేసే సదవకాశం మటుకు అతనికి దూరం అయిపోయింది.

గరుడాచలం మనమడు తెచ్చిన టిఫిన్ బాక్స్ రెండు చేతులతోను పైకి తీసుకుని కళ్లకు అద్దుకున్నాడు. తరువాత మూత తెరిచాడు. లోపల యేముందో చూచాడు. ఘుమఘుమలాడుతున్న ఉప్మా. వేరుశెనగ గింజలు, బటానీలు లోపల నుంచి పైకి తొంగి చూస్తున్నాయి. ఈ డబ్బాను ఇంకా తడికకే వేలాడుతున్న సాయిబాబా బొమ్మ దగ్గరకు తీసుకువెళ్లాడు. ఆయన ముందు వుంచి, కళ్లు మూసుకుని, నైవేద్యంగా సమర్పించి... ఆ తరువాత మట్టి నేల మీద చింకి చాపపై కూర్చున్నాడు. ప్రసాదం లాగ రెండు విడతలు ఉప్మా కళ్లకద్దుకుని నోట్లో వేసుకున్నాడు. టిఫిన్ బాక్స్ మూతలో కొద్దిగా ఉప్మా వుంది. మనమడికి అందించాడు. 'నువ్వు కూడా కాస్త రుచి చూడరా!' అని. కోడలు తనకోసం పంపించింది గదా అని ఎదురుగుండా పనిపిల్లాడు కూర్చుని వున్నా అంతా తానే తినే

## తడి

**త**డి తగలని మట్టి
వట్టి దుమ్మే
దానిలో
జీవం చిగురించదు
పచ్చదనం పరిమళించదు

తడి తగలని గుండె
వట్టి బండే
దానిలో
కరుణ జాలువారదు
ప్రేమ బ్రతికి బట్టకట్టదు

తడి తగలని మబ్బు
వట్టి పొగే
అది
చినుకును చిందించదు
పొలాన్ని పండించదు

తడి తగలని విత్తు
వట్టి చెత్తో
అది
మొలకై ముద్దులొలుకదు
తరులై నీడ పరచదు

**–జి. నీలకంఠం**

యటానికి మనస్సు ఒప్పుకోలేదు. 'నువ్వే తిను తాతయ్యా. నేను ఇంటికి వెళ్లాక తింటాను. నువ్వు తినేంత వరకు కూర్చుని, అప్పుడు ఇంటికి రమ్మంది అమ్మ నన్ను–' అన్నాడు వాడు. గరుడాచలం కళ్లు చమర్చాయి. ఏదో ఆ కోడలు పిల్ల ఇంత ప్రసాదం రోజూ పొద్దున్నే సప్లయి చేస్తోంది గనుక, ఈ 'పాడు శరీరం' ఇప్పటికీ ప్రాణం పోగొట్టుకోకుండా వుంది. కొడుక్కు తెలియకుండా పంపటానికి ఎన్ని యాతనలు పడుతోందో ఆ వెర్రి అమ్మాయి. అయినా కొడుక్కు కూడా తెలిసీ తెలియకుండా వుండి వుంటుంది. కొడుక్కు తనమీద పగ యేమీ లేదు. తన పద్ధతులు నచ్చవు వాడికి, అంతే!

'మంచి–మంచి వాడు అని పొగిడి నిన్ను, అందరూ ఇవ్వవలసిన దాన్లో నాలుగో వంతే ఇస్తున్నారు. నీకేమో నోట్లో నాలుక లేదు. నన్ను మాట్లాడనివ్వవు. ఇట్లా అయితే మనం మన్ను కొట్టుకుపోవడం ఖాయం–' అంటాడు వాడు. వాడు చెప్పేదీ నిజమే కావచ్చు. కాని అంత మాత్రాన తన మంచితనాన్ని పోగొట్టుకునేందుకు సిద్ధంగా వున్నాడా?

తన చేతికింద పనిచేయడం వల్ల, తనకేం గిట్టుబాటు కాదని తేల్చేసుకున్నాడు కొడుకు. అందుకనే తన వృత్తి సొంతంగా, తన చేతుల మీదుగానే అమర్చుకున్నాడు. అప్పుడు కూడా గరుడాచలం యేమీ కాదనలేదు. లోలోపల సంబరపడ్డాడు కూడా. వాడికయినా లోక వ్యవహారం తెలుస్తోంది. బతకడం ఎలాగో నేర్చుకుంటున్నాడు – అని సంతోషించాడు.

అయినా వాడు సిగరెట్లు తాగడం, అప్పుడప్పుడు మాదక పదార్థాలు సేవించడం.. ఇలాంటివి సహించడం మటుకు చేతకాకుండా పోయింది గరుడాచలానికి.

అతనికి తన కుటుంబం అంటే, కుటుంబ సంప్రదాయం అంటే, ఆచారాలు, కట్టుబాట్లు అంటే ఎంతో విశ్వాసం. ఆ గీతలు దాటకుండా వున్నంత వరకే మర్యాద అయినా, మప్పితం అయినా.

ఎప్పుడో నాలుగయిదు తరాల ముందు 'కంచి క్షేత్రం' నుంచి ఈ ప్రాంతానికి వచ్చేశారు తమ పూర్వీకులు. అందుకని తమ ఇంటిపేరు 'కంచి'గా నిర్ధారణ అయిపోయింది. 'కంచి గరుడాచలం' అంటే ఇప్పటికీ ఎంత గొప్ప పనివాడో, అంత ఆచారవంతుడు – సక్రమ వర్తనం వున్నవాడు అని పేరు ఉన్నదని అతనికి ఎంతో స్వాతిశయం. ఒకరకంగా గర్వం. ఆంతరికంగా తృప్తి. జీవితం సార్థకం అయిందని సంతోషం.

ఆచారం మాట అట్లా వుంచు – ఆరోగ్యం చెడిపోతుందిరా.. అని ఎన్ని రకాలుగా చెప్పినా వాడికి చెవికి ఎక్కలేదు. 'నేను ఇట్లాగే వుంటాను. నా పద్ధతులు నచ్చకపోతే నా పంచన ఉండకు. నీ ఇష్టం వచ్చిన చోటుకు పో. నన్ను సరిదిద్దటానికి మటుకు ప్రయత్నం చేయకు. ఇంతవరకు చేసింది చాలు. నీ దరిద్రం మేమంతా పంచుకున్నాం. ఇంక మా వల్ల కాదు. మా బతుకులు మేం మా ఇష్టం వచ్చినట్లు నడుపుకుంటాం. మా దారికి అడ్డురాకు. మమ్మల్ని వదిలెయ్యి–' అని కాస్సేపు ప్రాధేయంగా, కాస్సేపు తిరస్కారంగా.. మొత్తంమీద పొగరు బోతుగానే చెప్పాడు కొడుకు.

'ఈ వయసులో ఆయన ఎక్కడకు వెడతాడు? నలుగురి కోసం కాకపోయినా, 'ఆయన నీ తండ్రి' అని మర్చిపోతావేం?' అని కోడలు చెప్పటానికి ప్రయత్నించినా ఆమె మాటలకు బలం కలుగలేదు.

–అలా కుటుంబంలోంచి బయటపడిపోయాడు కంచి గరుడాచలం. ఏం చేయాలి? ఎక్కడకు వెళ్లాలి.. అని విచికిత్స పడుతున్నప్పుడు సాయిబాబా గుడి

## క్షణ సంసరణః

సాగరతీరంలో బారులు తీరిన
ఈ నా తీయని తలుపులు
సామజవరగమనాల సంగీత శృతులతో
సరి చేసినవి నా నిట్టూర్పుల అపశృతులను
సమసిపోయాయి నా సమస్యల గుంపులు
ఈ పరమపద సోపాన పయనించే
పరువాల స్పర్శలు
ఈ చిరుగజ్జెల సవ్వడిలో కరిగిపోయాయి
నా అహంకార శిఖరాలు
ఈ సుమధుర స్వరి జతుల తుషారాలు
నా కన్నీటి నాపిన స్వర్గధామాలు
విశ్వరూపం హాస్యం విరజిమ్మే
ఈ ఓంకార శబ్దాలు
క్షణ సంసరణః స్థితికి చేర్చాయి
సర్వమూ తామై
ప్రభూ! నీ స్పర్శను అందించావు
చేశావు పునీతను.

(క్షణ సంసరణః = ఈ సంసారాన్ని త్యజించటం)

–వసుమతి చలసాని

దిక్కయింది. దీనంగా గుడిముందు కూర్చుంటే, లోపలి బొమ్మ తనను దగ్గరకు రమ్మని పిలిచినట్లయింది. తనకేదో ఉపదేశం చేసినట్లు అనిపించింది.

సాయిబాబా బొమ్మ మెడకు వేలాడదీసుకుని, అదేరకంగా తానూ మేకప్ చేసుకుని రైలుపెట్టెలో తిరుగుతూ, పవిత్రంగా యాచన చేసుకుంటూ కాలం గడిపివేయడం- అప్పటినుంచీ అలవరుచుకున్నాడు.

ఎవరినీ నోరు తెరిచి అడగడు. మెడలో వేలాడుతున్న, గుండెల మీద బరువుగా ఆనుతున్న బొమ్మను చూపిస్తాడు అందరికీ. ఆయన కోసం అన్నట్లుగా చేయిజాపుతాడు. వేసిన వాళ్లు చిల్లర నాణేలు వేస్తారు. కొందరయితే కాగితాలే అందిస్తారు. భగవంతుడు నాకో మార్గం చూపించాడు - అని సంబరపడిపోయాడు కంచి గరుడాచలం.

దారి దొరికింది గదా అని దానినే దున్నుకుంటూ పోవడంలేదు. 'దురాశ దుఃఖానికి చేటు' అని చిన్నప్పటి నుంచి చదువుకున్న పాఠమే. కేవలం మూడు గంటలు ఉదయం, మూడు గంటలు సాయంత్రం ఈ పవిత్ర యాచన చేస్తాడు. తడికల పాక నుంచి బయలుదేరిన వాడు మళ్లీ అక్కడికే చేరుకుంటాడు. హాయిగా నిద్ర పోతాడు. ఎంత వచ్చింది అని ఎప్పుడూ ఆత్రంగా లెక్కవేసుకోడు రోజంతా గడిచిన తరువాత కూడా. అందులోంచి తనకు కావలసిన రొట్టె, బన్, టీ ఖర్చులు, అగరు వత్తులు, సాంబ్రాణి కడ్డీలు, వేష ధారణకు అవసరం అయిన ఖర్చులు అన్నీ ఇముడ్చుకుంటాడు. మిగిలిన పైసలు, కాగితాలు ఓ అట్ట పెట్టెలో పడేస్తాడు. పది రోజులకొకసారి ఆ అట్టపెట్టెను కోడలికి పంపిస్తాడు, బిందు ద్వారా. ఈ డబ్బు- ఎంత కొద్దే అయినా సరే- పిల్లల చదువులకు వాడుకో. నీ మొగుడి తాగుడుకు మాత్రం ఇవ్వకు- అని ముందే చెప్పాడు. బిందు తర్వాత ఆమెకో ఆడపిల్ల. కంచి గరుడాచలం ఎప్పుడూ వాళ్ల ఇంటికి వెళ్లడు. కొడుకు సరేసరి, కోడలు కూడా ఎప్పుడూ ఈ పాక దగ్గరకు రాదు. ఏమయినా చెప్పాలంటే, చూడాలనిపిస్తే, తానే రైల్వే స్టేషన్ దగ్గర కాచుకుని వుంటుంది, గరుడాచలం వచ్చేంతవరకూ.

గరుడాచలం రైలు ఎక్కుతాడు. మూడు గంటల పాటు ప్రయాణం చేస్తాడు- పవిత్రంగా యాచన చేస్తూ. తరువాత విశ్రాంతి తీసుకుంటాడు. కునుకు తీరిం తర్వాత తిరుగు ప్రయాణం చేస్తాడు. షరా మామూలే.

అతను ఉప్మా తినడం అయిపోయింది. టిఫిన్ కారియర్ గిన్నె శుభ్రంగా కడిగాడు. తుడిచాడు. బిందుకు తిరిగి యిచ్చేస్తూ 'బాబూ, బాగా చదువుకో' అన్నాడు. బిందు బంతిలా వెళ్లాడు. టిఫిన్ కారియర్ గిన్నె సంచిలో వేసుకుని భుజానికి తగిలించుకుని 'వస్తాను, తాతయ్యా.. మళ్లీ రేపు పొద్దున్నే వస్తాను' అని ఉరుకులు పరుగుల మీద వెళ్లిపోయాడు. కాస్త నిదానంగా నడవరా- అని వాడికి చెబుదామను కున్నాడు గరుడాచలం. కాని వాడు వినిపించే దూరం ఎప్పుడో దాటిపోయాడు.

తడిక తలుపు దగ్గరకు వేసి, వీధిలోకి వచ్చాడు గరుడాచలం. చుట్టూరా పాకలు, నీళ్ల మడుగులు, వాసన. ఎప్పుడెప్పుడు ఈ వాతావరణం నుంచి బయట పడి పక్కరోడ్డుకు వెడదామా అనిపిస్తుంది- ఎవరికయినా. గరుడాచలం మటుకు అడుగులు నిదానంగా వేస్తూ నడుస్తున్నాడు.

'అదుగో, గరుడాచలం గారు బయటకు వెడుతున్నారు. అంటే టైం ఎనిమిదిన్నర అయిందన్నమాట. నాకు తొందరగా అన్నంపెట్టు. తొమ్మిది గంటలకల్లా పనిలో చొరబడాలి'- అంటున్నాడు ఎవరో ఆసామి- తన పాక వరండాలోంచి భార్యతో పెద్దగానే.

టైం ఎనిమిదిన్నర అయిందని కూడా గరుడాచలానికి తెలియదు. అతనికి టైంతో నిమిత్తం లేదు. కాలమే అతన్ని అనుసరించి నడుస్తుంది. అతను కాలాన్ని అనుసరించాల్సిన అవసరం లేదు.

గరుడాచలం రైలు స్టేషన్‌కు చేరుకున్నాడు. గుమ్మంలో టిక్కెట్ కలెక్టర్ స్వాగతంగా చిరునవ్వు ప్రదర్శించాడు. గరుడాచలం కూడా నవ్వి అతని చేతిలో విభూతి ఉంచాడు. ముందుకు సాగి ప్లాట్‌ఫామ్ మీదకు చేరుకున్నాడు. 'ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్ బయలుదేరడానికి సిద్ధంగా వుంది' ఎనౌన్స్‌మెంట్.

గరుడాచలం ఓ స్లీపర్ కోచ్‌లో ఎక్కాడు. కంపార్ట్‌మెంట్ కారిడార్‌లో అడుగులు నింపాదిగా వేసుకుంటూ నడుస్తున్నాడు. టి 2 నెంబర్ నుంచి 1 నెంబర్ వరకు - ఒక పెట్టె నుంచి మరో పెట్టె వరకు - లెక్కవేసుకోకుండా ముందుకు నడుస్తూ వుండడమే అతని పని.

జీవితాన్ని అతను లెక్కపెట్టడు. జీవితం కూడా అతన్ని లెక్కపెట్టదు. ఎక్స్‌ప్రెస్ రైలు వేగం పుంజుకుంటూ ముందుకు పోతూనే వుంది. సాగుతూనే వుంది యాత్ర.

■